RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 280 | 1 మంగళవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పొగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## వెలిగొండ ఘనతపై టీడీపీ-వైసీపీ వాగ్వాదం

- లోకేశ్, జగన్ మధ్య మాటల యుద్ధం
- ప్రాజెక్టు ప్రారంభంపై పరస్పర విమర్శలు
- నీటి విడుదలతో కొత్త రాజకీయ చర్చ
- వెలిగొండ క్రెడిట్ ఎవరిదన్న దానిపై వివాదం



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 31 :** ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాల తాగు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు నిర్మించిన వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టు తొలి దశ ప్రారంభం నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య ఘనతపై తీవ్ర వాగ్వాదం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసిన నేపథ్యంలో రాజకీయ విమర్శలు మరింత వేడెక్కాయి. మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. 2024లో నీరు లేకుండానే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించారని ఆరోపిస్తూ, అప్పటి ప్రారంభోత్సవానికి సంబంధించిన చిత్రాలను పోస్టు చేశారు. "నీళ్లు లేని నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించడం వైసీపీ ప్రభుత్వానికే సాధ్యమైంది" అంటూ ఎద్దేవా చేశారు. సొరంగాల పనులు పూర్తయ్యాయని చెప్పి ప్రారంభోత్సవం నిర్వహించినప్పటికీ ప్రాజెక్టులో నీటి ప్రవాహం లేదని ఆయన పేర్కొన్నారు. మరోవైపు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యల్లో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు పునాది వేసింది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని, కీలకమైన సొరంగాల నిర్మాణాన్ని తమ హయాంలో పూర్తి చేశామని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. జగన్ చేసిన ఈ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగానే లోకేశ్ తాజా విమర్శలు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. - మిగతా 2లో..

## పౌరసేవల్లో డేటా అనలటిక్స్..

### పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 31 :** ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి - మిగతా 2లో..

## జగన్ ఎన్ని కుట్రలు చేసినా స్థానిక సంస్థల ఎన్నికలు ఆగవు: మంత్రి కొల్లు రవీంద్ర



**రాజధాని వాయిస్ మచిలీపట్నం, ఆగస్టు 31 :** బీసీ రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాపై కేసులు వేస్తుండటంపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైకాపా అధినేత జగన్ ఎన్ని కుట్రలు పన్నినా స్థానిక సంస్థల ఎన్నికలు ఆగవన్నారు. పాత ఓటర్ల జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్లనున్నట్లు చెప్పారు. ధైర్యం ఉంటే పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. స్థానిక ఎన్నికల విషయంలో జగన్‌ది ద్వంద్వ వైఖరి అని దుయ్యబట్టారు. ఏకగ్రీవాలను కూడా అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఆయన ఎన్ని కుట్రలు చేసినా తమను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు.

## సోన్ నది జలాలపై వివాదానికి ముగింపు



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 31 :** తూర్పు భారతదేశంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సోన్ నది జలాల పంపిణీ వివాదానికి కీలక పరిష్కారం లభించింది. కేంద్ర హోంమంత్రి, సహకార శాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల మధ్య సోన్ నది జలాల భాగస్వామ్యానికి సంబంధించిన అవగా హన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ద్వారా రెండు రాష్ట్రాల మధ్య ఉన్న దీర్ఘకాలిక జల వివాదానికి తెరపడిందని అమిత్ షా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా, బిహార్ మరియు ఝార్ఖండ్ రాష్ట్రాలు పరస్పర అవగాహనతో ముందుకు వచ్చి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయని అన్నారు. తూర్పు భారతదేశ అభివృద్ధికి నీటి వనరుల సమర్థ వినియోగం ఎంతో అవసరమని, ఈ ఒప్పందం ఆ దిశగా కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. సోన్ నది జలాల భాగస్వామ్యంపై కుదిరిన ఈ ఒప్పందం వల్ల బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని విస్తారమైన గ్రామీణ ప్రాంతాలకు సాగునీటి సదుపాయం మెరుగుపడనుంది. ముఖ్యంగా లక్షలాది మంది రైతులు వ్యవసాయానికి అవసరమైన నీటిని పొందడంతో పంటల ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రజలకు తాగునీటి సరఫరా కూడా మెరుగుపడుతుందని కేంద్ర హోంమంత్రి వెల్లడించారు. నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఈ ఒప్పందం ద్వారా స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ఈ ఒప్పందాన్ని అమలు చేయనున్నాయి. నీటి పంపిణీ, వినియోగం, నిర్వహణ అంశాల్లో సమన్వయంతో పనిచేసి ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. సోన్ నది జలాల ఒప్పందం దేశంలో అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి ఆదర్శంగా నిలుస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. పరస్పర చర్చలు, సహకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించనున్నదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## విశాఖలో ఏఐజీ ఆస్పత్రికి శంకుస్థాపన

- అత్యాధునిక వైద్య సేవలకు శ్రీకారం - నారా లోకేష్ చేతుల మీదుగా భూమిపూజ
- ఆరోగ్య రంగంలో కీలక పెట్టుబడులు - ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలే లక్ష్యం




**విశాఖపట్నం, ఆగస్టు 31 :** విశాఖపట్నంలో అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు ఏర్పాటు కానున్న ఏఐజీ ఆస్పత్రి నిర్మాణానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సోమవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ విశాఖ పట్నాన్ని ఆరోగ్య రంగంలో కూడా ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య సేవలు రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రావడం వల్ల చికిత్స కోసం - మిగతా 2లో..





## వెలిగొండలో ప్రవహించిన కృష్ణమ్మ జలాలు

- మూడు దశాబ్దాల కలకు సాకారం - సీఎం చంద్రబాబు జలహారతి ప్రత్యేక ఆకర్షణ
- లక్షల ఎకరాలకు సాగునీటి వరం - రైతుల ఆనందానికి అవధుల్లేవు

**రాజధాని వాయిస్ దోర్నాల, ఆగస్టు 31 :** ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సోమవారం సాకారమైంది. పశ్చిమ ప్రకాశం కరవు ప్రాంతాలకు జీవనాడిగా భావిస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద ప్రాజెక్టు సొరంగాల నుంచి ఉరకలెత్తుతూ వచ్చిన కృష్ణా జలాలకు ఆయన జలహారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంతో రైతులు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. గంటవానిపల్లె ఫీడర్ కెనాల్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా నీళ్లలోకి దిగి కృష్ణమ్మకు ప్రత్యేక - మిగతా 2లో..

## అయోధ్య మందిరానికి రూ.4 కోట్ల చెక్కు.. ఖాతాలో రూ.3

**రాజధాని వాయిస్ :** అయోధ్యలోని రామమందిర విరాళాల దుర్వినియోగం పై దర్యాప్తు జరుగుతోన్న వేళ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఈ ఆలయానికి ఓ భక్తురాలు ఇచ్చిన రూ.4కోట్ల చెక్కు బౌన్స్ అయ్యింది. దానికి కారణం తెలుసుకుని ట్రస్టు సిబ్బంది కంగుతి న్నారు. అసలేం జరిగిందంటే..ఇటీవల చెన్నైకి చెందిన ఓ భక్తురాలు అయోధ్య రామాలయాన్ని సందర్శించారు. రామమం దిర సిబ్బందికి అవసర మైన సౌకర్యాలు కల్పించేందుకు రూ.4 కోట్ల చెక్కును రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందజేశారు. విడిగా ఆలయ అభివృద్ధికి రూ.10వేల నగదును విరాళంగా ఇచ్చా రు. ఈ క్రమంలోనే డబ్బు డ్రా చేయడానికి ట్రస్ట్ సిబ్బంది బ్యాం క్‌ను సంప్రదించారు. కానీ, ఆ చెక్కు బౌన్స్ అయ్యింది. దీంతో ఆరా తీయగా సదరు మహిళ ఖాతాలో కేవలం రూ.3 బ్యాలెన్స్ ఉన్నట్లు చూసి సిబ్బంది షాక్ అయ్యారు. ఖాతాలో తగినంత నిధులు లేనప్పటికీ అంత పెద్ద మొత్తానికి చెక్కు ఇవ్వడం చర్చనీయాంశమైం ది. దీనిపై వివరణ కోరుతూ ఆమెకు నోటీసులు పంపనున్నట్లు సంబంధిత బ్యాంకు వెల్లడించింది. అయితే రూ.4కోట్ల విరాళం ఇచ్చిన సమయంలో ఆ మొత్తాన్ని కేవలం ఆలయ సిబ్బంది సౌకర్యాల కోసమే వినియోగి స్తామని లిఖితపూ ర్వక హామీ ఇవ్వాల్సిందిగా ఆ భక్తురాలు కోరినట్లు ట్రస్ట్ వెల్లడించింది. కానీ అందుకు తాము నిరాకరించామని తెలిపిం ది. ప్రస్తు తం చెక్‌బౌన్స్ గురించి ఆ మహిళను సంప్రదిస్తున్నామని పేర్కొంది. భద్రతా కారణాల రీత్యా ఆ భక్తురాలి వివరాలను గోప్యంగా ఉంచినట్లు వెల్లడించింది.

## రాయలసీమ అభివృద్ధికి రూ.8,022 కోట్లు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక విజన్
- గ్రామీణ మౌలిక వసతులకు పెద్దపీట
- తాగునీరు, వ్యవసాయం, అటవీ రంగాల్లో పురోగతి



**అమరావతి, ఆగస్టు 31 :** రాయలసీమ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో గత రెండేళ్లలో రూ.8,022 కోట్లకు పైగా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, అటవీ మరియు పర్యావరణ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ సీమ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొంది. గ్రామీణ మౌలిక వసతుల - మిగతా 2లో..

## కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర

- పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూడు జిల్లాల ప్రజల కల సాకారం
- దోర్నాల వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి
- తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు
- ప్రారంభోత్సవానికి భారీగా హాజరైన రైతులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు



**రాజధాని వాయిస్ ఒంగోలు ఆగస్టు 31 :** వెలిగొండ బంగారు కొండ అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలంలో వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను జాతికి అంకితం చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. "మాట ఇచ్చాను.. నిలబెట్టుకున్నాను. పునాది వేశాను.. ప్రాజెక్టును పూర్తి చేశానని సగర్వంగా చెబుతున్నాను. ఇది నా అదృష్టం. 30 ఏళ్ల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశాను. 30 ఏళ్ల తర్వాత మొదటి దశ ప్రారంభించి జాతికి అంకితం చేశాను. - మిగతా 2లో..

# విశాఖలో ఏఐజీ ఆస్పత్రికి శంకుస్థాపన



ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తూ మెరుగైన వైద్య మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఏఐజీ ఆస్పత్రి ఏర్పాటు ద్వారా జీర్ణాశయ, కాలేయ సంబంధిత వ్యాధులతో పాటు పలు ప్రత్యేక వైద్య సేవలు ఒకేచోట అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఆస్పత్రి వైద్య సేవలతో పాటు వైద్య విద్య, పరిశోధన రంగాలకు కూడా తోడ్పాటునందించనున్నట్లు పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆస్పత్రి నిర్మాణం విశాఖ నగర అభివృద్ధికి మరో మైలురాయిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.ఏఐజీ ఆస్పత్రుల వైస్ ఛైర్మన్ పీవీఎస్ రాజు, డైరెక్టర్ జీవీ రావు, ప్రధాన కార్యనిర్వహణ అధికారి సామ్ రిజ్వీ, విశాఖ ఏఐజీ ఆస్పత్రుల డైరెక్టర్ కే. రాకేష్ తదితరులు ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. ఆస్పత్రిని అత్యున్నత ప్రమాణాలతో నిర్మించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, విశాఖపట్నం పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ, ఏఐజీ ఆస్పత్రుల ప్రధాన నిర్వహణ అధికారి కాప్రీ జలోటతో పాటు పలువురు అధికారులు, వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయిన అనంతరం విశాఖపట్నం ఆరోగ్య రంగంలో దేశంలోని ప్రముఖ నగరాల సరసన నిలిచే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# వెలిగొండలో ప్రవహించిన కృష్ణమ్మ జలాలు





పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి భక్తిశ్రద్ధలతో హారతి ఇచ్చారు. అంతకుముందు జలహారతి ప్రదేశానికి చేరుకున్న ముఖ్యమంత్రికి గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పండితులు శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు.నల్లమల కొండలను ఛేదిస్తూ నిర్మించిన రెండు భారీ సొరంగాల ద్వారా కృష్ణా జలాలు గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని అక్కడి నుంచి నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి ప్రవహించాయి. ఈ అపూర్వ దృశ్యాన్ని సభా ప్రాంగణంలో ఉన్న వేలాది మంది రైతులు, మహిళలు, ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ అనంతరం తమ ప్రాంతానికి కృష్ణమ్మ చేరుకోవడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పూర్తికావడంతో ఈ ప్రాంత వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభించనుంది. ప్రాజెక్టు ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుండగా, సుమారు నాలుగు లక్షల మందికి తాగునీటి సౌకర్యం కలగనుంది. దీంతో కరవు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, డీబీవీ స్వామి, అనగాని సత్యప్రసాద్, పార్థసారథి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం రాష్ట్ర జలవనరుల అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ కూటమి ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రజలకు అంకితం చేయడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రాజెక్టును పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీరు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించడంతో ఈ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ లభించిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# పౌరసేవల్లో డేటా అనలటిక్స్..

రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో సంక్షేమ హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు.ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు.వ్యవసాయ రంగంలో 'అవేర్' (AWARE) వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర



నాడు చేసిన సంకల్పం.. నేడు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం.. కొండలు వస్తే తొలిచి ముందుకెళ్లాం. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను. నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆర్థికంగా కష్టాలున్నా.. ఎక్కడా వెనకడుగు వేయలేదు. వాన కోసం ఆకాశం వైపు చూసిన రైతుల బాధలు చూశాం. బోరు వేస్తే నీళ్లు పడక అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలను చూశాం. పనులు దొరక్క ఊరు విడిచి వెళ్లిన కూలీలను చూశాం. ఇక ఆ పరిస్థితులు ఉండవు.ఫ్లోరైడ్ అనే పదం మరచిపోతాం. 2019లో గొడ్డలి పార్టీ రాకతో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది. 2024లో వెలిగొండకు పట్టిన గ్రహణం వీడింది. గత ప్రభుత్వంలో కేవలం 2.77 శాతమే పనులు చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి చెల్లింపులతో మోసం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశామని డ్రామాలాడారు. ఫేక్ ప్రచారాలతో కరవు రైతుల జీవితాలతో ఆడుకున్నవారిని ఏమనాలి? ప్రధాని మోదీ సాయం.. మిత్రుడు పవన్ సహకారంతో ముందుకెళుతున్నాం. కరవుతో పోరాడిన రైతన్నకు కృష్ణా జలాలతో స్వాగతం పలికాం. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టానికి ముగింపు. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. కరవుపై గెలవాలన్న సంకల్పంతో ముందడుగు వేశాం. కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర ఇది. 2024 ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్, నేనూ కలిసి రాష్ట్ర పునర్నిర్మాణంపై మాట ఇచ్చాం. మాపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యమిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి అన్నీ ప్రయోజనాలే.

**నీటి సమస్యకు పరిష్కారం.. నదుల అనుసంధానం..**

చేతగాకపోతే తప్పు లేదు.. చేశామని మోసం చేస్తేనే పెద్ద తప్పు. ఫేక్ మాటలు చెప్పేవారిని నిలదీయకపోతే అవే వాస్తవాలు అనుకుంటారు. ఆవేదనతో చెబుతున్నా.. ఫేక్ మాటలను సమర్థంగా తిప్పికొట్టాలి. నీటి సమస్యకు ఏకైక పరిష్కార మార్గం.. నదుల అనుసంధానం. నదుల అనుసంధానం జరగాలంటే.. ప్రధాని మోదీకే సాధ్యం. పోలవరం రాష్ట్రానికే జీవనాడి. పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. రాబోయే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలో కూడా చేసుకోబోతున్నాం. గోదావరి నీళ్లు కూడా నల్లమలసాగర్‌కు రావాలి. ఉత్తర భారత్‌లో నదుల అనుసంధానానికి అనేక సమస్యలు పరిష్కరించారు. దక్షిణ భారత్‌లో కూడా గోదావరి, కావేరి అనుసంధానం చేయాలి. గోదావరి నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. వృథాగా వెళ్లే నీటిని దారిమళ్లిస్తే సంపద సృష్టించొచ్చు. నదుల అనుసంధానంతో దేశం సుభిక్షంగా ఉంటుంది. ఎల్లుండే పోలవరం ఎడమకాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్తున్నాం. ప్రతి నీటిబొట్టును భూగర్భ జలాలుగా మార్చుకోవాలి. నదుల అనుసంధానం జరిగితేనే మంచి భవిష్యత్తు ఉంటుంది.

నల్లమలసాగర్ నుంచి ప్రతిఇంటికి కుళాయి ద్వారా నీరిస్తాం. రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్‌లో మార్కాపురాన్ని భాగం చేశాం. వెనుకబడిన ఈ ప్రాంతం పొరుగు జిల్లాలకు పోటీగా నిలుస్తుంది. వెలిగొండ తొలి దశతో ఆగము.. ఫేజ్ 2 కూడా 2028 నాటికి పూర్తి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రకు అందరూ సిద్ధమని సంకల్పించాలి. నాకు రాజకీయం అంటే ఎన్నికలు కాదు.. ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తా. నెక్స్ట్ ఎన్నికల కోసం కాదు.. నెక్స్ట్ జనరేషన్ కోసం పనిచేస్తా. నా ఊపిరి ఉన్నంత వరకు తెలుగు జాతి కోసం కష్టపడతా. అందరం కలిసి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ చేదాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# రాయలసీమ అభివృద్ధికి రూ.8,022 కోట్లు

అభివృద్ధిలో భాగంగా రూ.4,523 కోట్లతో 23 వేలకుపైగా రహదారి పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 5,238 కిలోమీటర్ల మేర బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తికాగా, గ్రామీణ ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానం మరింత బలోపేతమైందన్నారు. గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు.ఉపాధి హామీ పథకం ద్వారా 62 వేల ఎకరాల్లో ఉద్యాన సాగును ప్రోత్సహించగా, 28 వేల మందికిపైగా రైతులు లబ్ధి పొందినట్లు వెల్లడించారు. 41,614 ఫారం పాండ్లు, 15 వేల మినీ గోకులాల నిర్మాణం చేపట్టి రైతులకు, పాడి పరిశ్రమకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. జల సంరక్షణ చర్యలతో పాటు నీటి కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడిందని తెలిపారు. జల్ జీవన్ మిషన్--అమరజీవి జలధార పథకం కింద రూ.2,782 కోట్ల వ్యయంతో పులివెందుల, డోన్, చిత్తూరు మెగా వాటర్ స్కీమ్‌ల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అలాగే పారిశుధ్య రంగంలో కంపోస్ట్ గుంతలు, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు.అటవీ మరియు పర్యావరణ పరిరక్షణలో భాగంగా 13 నగర వనాల అభివృద్ధి, ముసలమడుగులో కుంకీ ఏనుగుల సంరక్షణ కేంద్రం, ఎకో టూరిజం, ఫుడ్ బ్యాంకుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. కుంకీ ఏనుగుల వినియోగంతో మానవ--ఏనుగు ఘర్షణలు 75 శాతం, పంట నష్టం 50 శాతం మేర తగ్గినట్లు అధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతులు, వ్యవసాయం, తాగునీరు, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలు రాయలసీమ అభివృద్ధికి కొత్త దిశను చూపుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది.

# వెలిగొండ ఘనతపై టీడీపీ-వైసీపీ వాగ్వాదం

సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను అధికారికంగా ప్రారంభించి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలి విడతలో 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడం ద్వారా ప్రాంత ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందనున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని టీడీపీ ప్రభుత్వం చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణిస్తోంది.ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ సమస్యలతో బాధపడుతున్న ప్రాంతాలకు ఉపశమనం లభించనుంది. సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు నాలుగు లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించబడనుంది. దీంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రాంత ప్రజల కల సాకారమైందని ప్రభుత్వం పేర్కొంటోంది. అయితే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం, పూర్తి చేయడం, నీటి విడుదల వంటి అంశాలపై రాజకీయ పార్టీలు తమ తమ వాదనలు వినిపిస్తుండటంతో క్రెడిట్ రాజకీయాలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు ప్రయోజనాలు ప్రజలకు చేరడం ముఖ్యమా, లేక దాని ఘనత ఎవరిదనే అంశమా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో వెలిగొండ అంశం మరికొంత కాలం ప్రధాన చర్చగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో బ్రదర్ సిరాజ్ మర్యాదపూర్వక భేటీ!



అమరావతి, ఆగస్టు 31 :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ నివాసానికి అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ సిరాజ్ మర్యాదపూర్వకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్‌ను ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్రదర్ సిరాజ్ మాట్లాడుతూ ఇప్పటివరకు వక్ఫ్ బోర్డు చైర్మన్లుగా వచ్చిన వారు ఈ పదవిని హోదాగా భావించారు.తప్ప, బాధ్యతగా భావించలేదు. మొట్టమొదటిసారిగా అబ్దుల్ అజీజ్ వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవిని ఒక బాధ్యతగా భావించి పనిచేస్తున్నారు. వక్ఫ్ బోర్డు ద్వారా సమాజానికి ఎంతగా ఉపయోగపడవచ్చో తన కార్యాచరణతో నిరూపిస్తున్నారు అని ప్రశంసించారు.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధి, వక్ఫ్ సంస్థల బలోపేతం కోసం అబ్దుల్ అజీజ్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని సిరాజ్ పేర్కొ న్నారు. చైర్మన్ పదవి కేవలం హోదా కాదు.. సమాజం పట్ల ఉన్న బాధ్యత అని అబ్దుల్ అజీజ్ తాలిం ఏ హునర్, తన పనితీరు ద్వారా నిరూపిస్తున్నారని ఆయన అన్నారు.

# ప్రశాంత్‌రెడ్డికి నా ఉసురు తగులుతుంది: కవిత

నిజామాబాద్: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏ తప్పూ చేయకున్నా తిహాడ్ జైలులో పెట్టారని అన్నారు. తండ్రిని బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే మొదటి పాత్ర అని దుయ్యబట్టారు. ఆయన శకుని పాత్ర పోషించినట్లు ఆరోపించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో కవిత మాట్లాడుతూ కంటతడి పెట్టారు. "హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కుమారుడిలా చూసుకుంటే.. ఆయన మా మధ్య చిచ్చుపెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో మాట్లాడారు. ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. నెల రోజులు అమెరికాలో ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారు.ప్రశాంత్‌రెడ్డికి ప్రజా జీవితం లేదు. ఆయన బాల్కొండ నుంచి పారిపోవాలి. ప్రశాంత్‌రెడ్డి వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో ప్రయత్నం చేశా. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి ఎంతో కష్టపడ్డాను. అయితే వారందరూ నన్ను పరాజితురాలిని చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహాడ్ జైలులో పెట్టారు? నిజామాబాద్ జిల్లా కోడలిగా ఉద్యమం చేసిన నన్ను నాలుగేళ్లు ఈడీ, సీబీఐ వేధింపులకు గురిచేశాయి. చివరకు నేను ఏ తప్పు చేయలేదని తేలింది. నన్ను ఎందుకోసం పార్టీ నుంచి బహిష్కరించారు? తెలంగాణ రక్షణ సేన.. పదవుల కోసం పెట్టిన పార్టీ కాదు. కన్నీళ్లు పెట్టుకున్నానని నేను పిరికిదాన్ని అనుకోవద్దు" అని కవిత చెప్పారు.

# హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి పొన్నం

హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ సమీపం ఉమాపూర్‌లోని శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించి సుమారు రూ. 15 కోట్లతో నిర్మించనున్న వసతి గృహ భవనాలకు సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభించిన ఈ కళాశాలలో ప్రవేశాల సంఖ్య 175కు పెరిగిందని తెలిపారు. మారుతు న్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులను తీసుకొస్తానన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. హుస్నాబాద్లో ఇంజినీరింగ్ కళాశాల మండలంలో ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. చిగురుమామిడి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, సైదాపూర్ మండలంలో అదనంగా మరో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభించనున్నట్లు మంత్రి పొన్నం చెప్పారు. భీమదేవరపల్లి మండలంలో నవోదయ పాఠశాల ఎల్కతుర్తి మండలంలో ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ రాబోతున్నాయన్నారు. హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ, మరో స్టేడియాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని, రేపటి భవిష్యత్తులో మంచి ప్లేస్మెంట్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్, ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి, పుర అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్‌పే కొత్త ఫీచర్.. ఇంటర్నెట్ లేకున్నా యూపీఐ చెల్లింపులు!

ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే ఒక కీలకమైన ఫీచర్‌ను అందుబాటు లోకి తెచ్చింది. ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోయినా యూపీఐ చెల్లింపులు జరిపేందుకు వీలు కల్పించే »UPI 123Pay' సేవలను ప్రారంభిం చింది. ముఖ్యంగా ఇంటర్నెట్ సదుపాయం లేని ఫీచర్ ఫోన్ (బేసిక్ ఫోన్) వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ సేవలను ప్రవేశపెట్టిం ది. ఈ ఫీచర్‌ను విస్తృతం గా ప్రజల్లోకి తీసుకె ళ్లేందుకు నోకియా, హెచ్‌ఎండీ, లావా, ఐటెల్ వంటి ప్రముఖ మొబైల్ తయారీ సంస్థలతో ఫోన్‌పే భాగస్వా మ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, ఇకపై మార్కెట్లోకి వచ్చే ఆయా కంపెనీల కొత్త ఫీచర్ ఫోన్లలో »UPI 123Payµ అప్లికేషన్ ముందే ఇన్‌స్టాల్ అయి ఉంటుంది.ఈ సేవలను వినియోగించుకోవడానికి, వినియోగదారులు తమ ఫోన్‌లోని యాప్‌ను ఓపెన్ చేసి, సంబంధిత బ్యాంకును ఎంచుకోవాలి. అనంతరం తమ డెబిట్ కార్డులోని చివరి ఆరు అంకెలను నమోదు చేసి, యూపీఐ పిన్‌ను సెట్ చేసుకో వాల్సి ఉంటుంది. ఈ ఫీచర్ ద్వారా కేవలం చెల్లింపులే కాకుండా, బ్యాంకు బ్యాలెన్స్ తనిఖీ చేయడం, గత లావాదేవీల వివరాలను చూసుకోవడం వంటి సేవలను కూడా పొందవచ్చు.దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించడమే లక్ష్యంగా ఈ ఫీచర్‌ను ప్రవేశపెట్టినట్లు ఫోన్‌పే తెలిపింది. ఆంగ్లంతో పాటు 12 భారతీయ భాషలలో ఈ సేవలు అందుబాటులో ఉండటం వల్ల మరింత ఎక్కువ మందికి డిజిటల్ లావాదేవీలు చేరువ కానున్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- అనంతపురంలో ప్రజాదర్బార్ నిర్వహణ
- పయ్యావుల కేశవ్‌కు వినతుల వెల్లువ
- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు
- ప్రజలకు అందుబాటులో ఉంటామని మంత్రి హామీ



**రాజధాని వాయిస్ అనంతపురం:** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనంతపురం నగరంలోని రామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై తమ సమస్యలు, వినతులను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని మంత్రి తెలిపారు. ప్రజాదర్బార్ సందర్భంగా భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆదాయ ధ్రువపత్రాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర అంశాలకు సంబంధించిన వినతులు పెద్ద ఎత్తున వచ్చాయి. ప్రతి ఒక్కరి సమస్యను మంత్రి స్వయంగా ఆలకించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు స్పందించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందని మంత్రి అన్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడటం ద్వారా వారి అవసరాలు, సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం లభిస్తోందని చెప్పారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. వినతులపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు మంత్రి సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని, ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ పునరుద్ఘాటించారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి చేరుతున్నాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ



**రాజధాని వాయిస్ మచిలీపట్నం, ఆగస్టు 31** :మచిలీపట్నంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రజాదర్బార్ నిర్వహి ంచి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం, వారికి మెరుగైన సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో ప్రజల సమస్యల పరిష్కారం ప్రశ్నార్థకంగా మారిందని, తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలకు సరైన వేదిక కూడా లేకపోయిందని మంత్రి విమర్శించారు. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాల ద్వారా నేరుగా వినతులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్న మంత్రి, ప్రతి సమస్యను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# నీటి సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి



**రాజధాని వాయిస్ నంద్యాల,:** రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన "చలో కలెక్టరేట్" కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నాయకత్వంలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కలెక్టరేట్ ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసిపోయింది. సాగునీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "రైతులకు నీరు ఇవ్వాలి.. ప్రజలకు తాగునీరు అందించాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు, ప్రజల నీటి సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సాగునీరు లేక రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. నీటి సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ప్రజా అవసరాల దృష్ట్యా చూడాలని సూచించారు. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో రాయలసీమ ప్రాంత రైతులకు సాగునీరు విడుదల చేసే అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు. రైతాంగానికి భరోసా కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, సాగునీరు, తాగునీటి సరఫరాపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.నీటి సమస్య పరిష్కారం అయ్యే వరకు రైతులు, ప్రజల తరఫున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి స్పష్టం చేశారు. రైతాంగ హక్కుల కోసం అన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఆందోళన కార్యక్రమం అనంతరం వైసీపీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.80 లక్షల ఆర్థిక సాయం



**రాజధాని వాయిస్ చిలకలూరిపేట, ఆగస్టు 31** : చిలకలూరిపేటలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రమాదాలు, మరణాలు, దుర్ఘటనలను రాజకీయాలకు వేదికగా మార్చడం బాధాకరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవడం, వారికి అవసరమైన సహాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు.రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఎనిమిది మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.80 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సాయం బాధిత కుటుంబాలకు కొంత ఊరటనిస్తుందని, వారి పట్ల ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తిస్తోందని పేర్కొన్నారు. బాధిత కుటుంబాల సభ్యులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు వారికి ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ప్రమాద బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం

- విశాఖ ఏక్యూఐ వివరాలు ప్రజలకు అందుబాటులో
- కాలుష్య నియంత్రణకు శాఖల సమన్వయం
- జవాబుదారీతనంతో పనిచేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి





**రాజధాని వాయిస్ విజయవాడ, ఆగస్టు 31** : రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశ్రామికాభివృద్ధిని సమతుల్యం చేస్తూ ముందుకు సాగుతున్నామని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు డాక్టర్ సందీప్ పంచకర్ల తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించడంతో పాటు కాలుష్య నియం త్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నవంబర్ 2025 నుంచి ఆగస్టు 2026 వరకు విశాఖపట్నం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ వివరాలను పారదర్శ కంగా మీడియా ద్వారా ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపారు. గాలి నాణ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సరికొత్త కార్యాచరణతో ప్రజలకు మరింత జవాబుదారీ తనంతో సేవలందిస్తోందని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూనే పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా కఠిన నిబంధనలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా జీవీఎంసీ, పంచాయతీ రాజ్, మైనింగ్, పరిశ్రమలు, రవాణా, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయం చేసు కుంటూ పనిచేస్తున్నామని తెలిపారు.వివిధ శాఖల సహకారంతో కాలుష్య నియంత్రణకు సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలో గాలి నాణ్యత, కాలుష్య స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ సందీప్ పంచకర్ల తెలిపారు. పరిశ్రమల కార్యకలాపాలు, రవాణా, నిర్మాణ పనులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కాలుష్య నియంత్రణకు చర్యలు కొనసాగిస్తు న్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు, విస్తరణకు అవసరమైన అనుమతులు, మార్గదర్శకాలను అందిస్తూనే పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తోందని తెలిపారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

- స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్ష
- సంక్షేమ పథకాల అమలుపై విస్తృత చర్చ
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు



**రాజధాని వాయిస్ మచిలీపట్నం, ఆగస్టు 31** :రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మచిలీ పట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రభుత్వ కార్యక్రమా లు, సంక్షేమ పథకాల అమలు, జిల్లా అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.కృష్ణా జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్ డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తూ కృష్ణా జిల్లాను అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను గ్రామస్థాయిలో విస్తృతంగా వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలు, పార్టీ కార్యాచరణ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన లోకేష్

- రాజకీయ విలువలకు ప్రతీకగా కొనియాడిన మంత్రి
- సిరిపురం సర్కిల్‌లో ఘనంగా కార్యక్రమం
- పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధుల




**రాజధాని వాయిస్ విశాఖపట్నం, ఆగస్టు 31** : దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాజకీయ విలువలు, ప్రజాసేవా స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం విశాఖపట్నంలోని సిరిపురం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, రాజకీయ జీవితమంతా నిబద్ధత, నిజాయితీ, ప్రజా సంక్షేమానికి అంకితం చేసిన నాయకుడిగా రోశయ్య గుర్తింపు పొందారని పేర్కొన్నారు. వివిధ కీలక పదవుల్లో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో రోశయ్య చూపిన చిత్తశుద్ధి, రాజకీయాల్లో పాటించిన విలువలు నేటి తరానికి మార్గదర్శకమని లోకేష్ పేర్కొన్నారు. రాజకీయ నాయకులు ప్రజల కోసం ఎలా పనిచేయాలనే విషయాన్ని ఆయన జీవితం స్పష్టంగా చాటిచెప్పిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్, విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీ కృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ తదితరులు పాల్గొన్నారు. వారు కూడా రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.రోశయ్య రాజకీయ జీవితంలో ప్రజా సంక్షేమం, పరిపాలనా అనుభవం, ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేశారని పలువురు వక్తలు గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోశయ్యకు నివాళులర్పించారు. కార్యక్రమం ఘనంగా నిర్వహించబడగా, ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు.

## హమారా ప్రసాద్ పై దేశ ద్రోహం కేసు నమోదు చేసి అరెస్టు అరెస్టు చేయాలి



**సత్తెనపల్లి.ఆగస్టు 31,రాజధాని వాయిస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాదును అరెస్టు చేయాలని అంబేద్కర్ ప్రజాసంఘం ఆధ్వర్యంలోపట్టణం ర్యాలీ నిర్వహించారు. ముందుగా 8వ వార్డు లో ఉన్న అంబేద్కర్ విగ్రనికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా దావులూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, హమారా ప్రసాద్ అనే వ్యక్తి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కించపరుస్తూ రచిస్తున్న కల్పిత నాయకుడు అనే పుస్తకాన్ని నిషేధించాలని హమారా అనే వ్యక్తి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గత కొంత కాలంగా సామాజిక మాధ్యమాల్లో రాజ్యాంగాన్ని అవమానించేలా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ, అంబేద్కర్ పై అసత్య ఆరోపణలు చేస్తూ ఉద్దేశ్య పూర్వకంగా దళిత సామాజిక వర్గాలను రెచ్చగొడుతూ సమాజంలో అశాంతి సృష్టించాలని ప్రయత్నిస్తున్నాడని,ఇలాంటి దేశ ద్రోహిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకుడు. జై భీమ్రావు పార్టీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి కూచిపూడి జాన్ బాబు దళిత బహుజన ఫ్రంట్ జిల్లా జనరల్ సెక్రటరీ నందిగామ చిట్టిబాబు.దళిత నాయకుడు గుడిపూడి వెంకటేశ్వర్లు. (జర్మనీ )అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జిల్లెల్ల పాల్ రాజు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదంశెట్టి వేదాద్రి.మల మహానాడు ముప్పాళ్ళ మండలం అధ్యక్షులు చావచంద్రం. సత్తెనపల్లి పట్టణ బహుజన సమాజ్ పార్టీ జనరల్ సెక్రటరీ మల పాటి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ పర్యటనకు పకడ్బంది ఏర్పాట్లు



**నరసరావుపేట.ఆగస్టు 31,రాజధాని వాయిస్:**రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సెప్టెంబర్ 2న నరసరావుపేటలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఈ ఏర్పాట్లను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దగ్గరుండిపరిశీలిస్తున్నారు.పర్యటనలో భాగంగా జెఎన్టీయూకే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, నరసరావుపేటలో నిర్మించిన హాస్టల్ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అరవిందబాబు, నరసరావుపేట ఎంపీ లావు.శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ కోఆర్డినేటర్ బీటీ నాయుడుతో కలిసి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా ఏఎం రెడ్డి కళాశాల సమీపంలో నిర్వహించనున్న నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్యాడర్ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపి ఎస్ఎస్ డిసి ఆద్వర్యంలో జాబ్ మేళా



**పిడుగురాళ్ళ.ఆగస్టు 31,రాజధాని వాయిస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపి ప్రభుత్వం ఆదేశముల మేరకు నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తున్నది. దీనిలో భాగముగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజి రావు తెలియపరిచారు, గవర్నమెంట్ జూనియర్ కళాశాల, పిడుగురాళ్ళ పట్టణంలో జాబ్ డ్రైవ్ ను నిర్వింహించడం జరిగింది.ఈ జాబ్ డ్రైవ్ కు 10 కంపెనీలు హాజరు కాగా 145 మంది హాజరుఅయ్యారని, అందులో 48 మంది ఉద్యోగాలకు ఏంపిక అయ్యారని తెలియజేసినారు. కాలేజీ ప్రిన్సిపల్ యం.వెంకట నరసయ్య మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ జాబ్ మేళ ను పిడుగురాళ్ళలో నిర్వహించడం చాలా సంతోషకరమని,నియామక పత్రలు అందుకున్న యువతకు అభినందలు, మరెన్ని ఉన్నత శిఖరాలను అందుకునే విధంగా నైపుణ్యాలనుమెరుగుపరుచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగ కల్పనా అధికారి యం. రవీంద్ర నాయక్, సిఆర్ఓ కిరణ్ నాయక్, పిడుగురాళ్ళ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పి. శ్రీకాంత్ కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నల కడుపు నిండ .. వెల్లువై వెలిగొండ

- సాగునీటి ప్రాజెక్టులే దేశ ప్రగతికి విజ్ఞాన సంకేతాలు

- సమర్ధమైన నాయకత్వంతో దేశం సార్వతో ముఖాభివృద్ధి



**మాగులూరి భానుప్రకాష్ (యూఎస్ఏ)వాషింగ్టన్ డిసి,ఆగస్టు 31, రాజధాని వాయిస్:** ప్రపంచం సాంకేతిక, కృత్రిమ మేధపై ఆధారపడుతున్నా నేటికీ భారతదేశంలోని కోట్లాది మందికి అన్నం పెట్టే రైతే దేవుడు.తాగు, సాగునీటి ప్రాజెక్ట్ లే దేశ ప్రగతికి మానవ విజ్ఞానానికి సంకేతాలని ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా నది వరద జలాలను మళ్లించి సాగునీరు, తాగునీరు అందించడానికి చేపట్టిన భారీ సాగునీటి ప్రాజెక్ట్ వెలిగొండ. ముఖ్యంగా కరువు జిల్లాలైన ప్రకాశం, నెల్లూరు,కడప ప్రాంతాల రైతన్నలకు కీలకం. ఎత్తైన ప్రాంతాల్లో వర్షపాతం తక్కువగా, అస్థిరంగా ఉండటం వల్ల తరచుగా కరువు పరిస్థితులను ఎదుర్కొనటానికి నల్లమల కొండల కిందుగా నిర్మించిన రెండు భారీ టన్నెల్స్ ద్వారా కృష్ణా వరద నీటిని టన్నెల్స్, ఫీడర్ కెనాల్ ద్వారా నల్లమలసాగర్‌కు తరలించే విధంగా ప్రణాళిక రూపకల్పన, కార్యాచరణ అభినందనీయమన్నారు.ముప్పై ఏళ్ళు పాటు సుదీర్ఘ అవాంతరాలు ఎదుర్కొన్నా నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అకుంఠిత దీక్షా దక్షత తోడై కూటమి ప్రభుత్వ పాలనలో తొలి దశ ద్వారా సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం దిశగా సాగుతుంది. దేశ ప్రగతికి సాంకేతిక విజ్ఞానంతో పాటు, సమర్ధ నాయకత్వం కూడా తోడై దేశం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఒక రైతు బిడ్డగా కోరుకుంటూన్నానన్నారు.

# కలెక్టర్‌కు అగ్రిగోల్డ్ బాధితుల వినతి

- న్యాయం చేస్తామని హామీ



**నరసరావుపేట.ఆగస్టు 31రాజదాని వాయిస్ :** అగ్రిగోల్డ్ బాధితులకు త్వరితగతిన మరియు గరిష్టంగా న్యాయం జరిగేలా ఆస్తుల వేలం ప్రక్రియలో తగిన సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా హామీ ఇచ్చారు. ఆల్ ఇండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు జిల్లా లీగల్ కమిటీ (డి ఎల్ సి) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా డి.ఎల్.సి సభ్యులు రామాంజనేయులు వినతిపత్రంలోని పలు కీలక అంశాలను కలెక్టర్‌కు క్షుణ్ణంగా వివరించారు. ఆస్తుల వేలం ద్వారా బాధితులకు ఎక్కువ డబ్బులు వచ్చేలా ఈ క్రింది ప్రతిపాదనలను కమిటీ సభ్యులు కలెక్టర్ ముందుంచారు. రాజధాని పరిధిలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను పెద్ద మొత్తంలో కాకుండా, గజాల లెక్కన విక్రయిస్తే ఎక్కువ మంది కొనుగోలుకు ముందుకు వస్తారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న అగ్రిగోల్డ్ కంపెనీకి సంబంధించిన విలువైన భవనాలను స్క్వేర్ ఫీట్ల చొప్పున వేలం వేయడం ద్వారా మార్కెట్ ధర కంటే మంచి రేటు లభిస్తుందని వివరించారు. భారీ విస్తీర్ణంలో ఉన్న భూములను ఒకేసారి వేలానికి పెట్టకుండా, 5 ఎకరాలు లేదా 10 ఎకరాల చొప్పున చిన్న బిట్లుగా విభజించి వేలం వేస్తే ఎక్కువ మంది వ్యాపారులు, కొనుగోలుదారులు పాడుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పేద ప్రజలకు అందించే ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్‌లకు లేదా ఇతర ప్రభుత్వ ప్రయోజన కార్యక్రమాలకు అవసరమైన స్థలాలను ఈ అగ్రిగోల్డ్ ల్యాండ్స్ నుండి ప్రభుత్వం సేకరించి, ఆ మొత్తాన్ని బాధితులకు నేరుగా అందజేస్తే మరింత వేగంగా న్యాయం జరుగుతుందని కోరారు. కమిటీ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ కృత్తికా శుక్లా ఈ సూచనలు చాలా బాగున్నాయని అభినందించారు. అగ్రిగోల్డ్ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ఈ అంశాలన్నింటినీ తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తన వంతు పూర్తి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, బాధితులు మరియు డి.ఎల్.సి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాసు మహేష్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరిన టిడిపి కార్యకర్తలు



**దాచేపల్లి.ఆగస్టు 31 రాజధాని వాయిస్ :**గురజాల నియోజకవర్గంలో దాచేపల్లి నగర పంచాయతీకి చెందిన ముఖ్య నాయకుడు మశ్యం శ్రీనివాసరావు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చకే తాను పార్టీ మారినట్లు శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వైఎస్సార్‌సీపీ లోకి వచ్చే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం, గౌరవం లభిస్తుందని, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పారిశ్రామిక పెట్టుబడులకు ఎన్టీఆర్ జిల్లా ప్రాధాన్యం

- డీఐఈపీసీ సమావేశంలో కీలక సమీక్ష
- సింగిల్ డెస్క్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి
- ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాల ఆమోదం
- పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవల లక్ష్యం




**రాజధానివాయిస్ విజయవాడ:** ఎన్టీఆర్ జిల్లా పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతమివ్వాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఐఏఎస్ అధ్యక్షతన విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక మరియు పారిశ్రామిక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో జిల్లాలో పెట్టుబడుల ప్రోత్సాహం, పరిశ్రమల స్థాపన, అనుమతుల మంజూరు, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు జిల్లాను పెట్టుబడులకు అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో పారిశ్రామిక ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తుల పురోగతిని అధికారులతో సమీక్షించారు. మొత్తం 258 దరఖాస్తులు అందగా వాటిలో ఇప్పటికే 226 దరఖాస్తులకు అనుమతులు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. మిగిలిన దరఖాస్తులను కూడా నిర్ణీత కాలపరిమితిలో పరిశీలిం చి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెట్టుబడిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పారదర్శకమైన విధానంలో సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సమావేశంలో పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సమయానికి అందించడం ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంపొందించవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సమావేశంలో స్పష్టమైంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించిన 22 క్లెయిమ్‌లకు రూ.3.24 కోట్ల ప్రోత్సాహకాలను మంజూరు చేసేందుకు డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. ఈ ప్రోత్సాహకాలు స్థానిక పారిశ్రామిక వేత్తలకు మరింత ప్రేరణనిచ్చి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను ముందుగానే గుర్తించి అందుబాటులో ఉంచడం ద్వారా పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించాలని నిర్ణయించారు. అలాగే విద్యుత్, రహదారులు, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్టీఆర్ జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూములు, అనుమతులు, మౌలిక సదుపాయాలను వేగంగా అందించడం ద్వారా జిల్లాలో కొత్త పరిశ్రమలను ఆకర్షించి ఉపాధి అవకాశాలను విస్తరించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## డ్రోన్ నిఘాతో నేరాల నియంత్రణ

**రాజధాని వాయిస్ బాపట్ల, ఆగస్టు 31 :** జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి బాపట్ల జిల్లా పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామ హేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగి స్తున్నారు. జిల్లాలో గుర్తించిన క్రైమ్ ప్రోన్ ప్రాంతాలు, జనస మ్మర్ద ప్రాంతాలు, కీలక కూడళ్లు అనుమానాస్పద కార్యకలాపాలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో ఎత్తైన ప్రాంతాల నుంచి పర్యవేక్షణ నిర్వహిస్తూ పరిస్థితులను ఎప్పటిక ప్పుడు పరిశీలిస్తున్నారు.నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడం, అను మానాస్పద కదలికలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టడం, శాంతిభద్రతల పరిరక్షణలో డ్రోన్ సాంకేతికత కీలకంగా మారిందని పోలీసులు తెలిపారు.

## అప్పికట్ల వారింటి ఆణిముత్యం



**గుంటూరు. ఆగస్టు 31రాజధాని వాయిస్ :**బీదరికపు అగచాట్లను సహనమున భరియించి బరువు బాధ్యతలలో తల్లికి అండగా నిలిచి అణచివేయు జనుల అహమును ఖండించినిచ్చెన మెట్ల కట్టుబాటును నిరసించెనే. భరతమాత దాస్య శృంఖలము లను బాపమహాత్ముని అహింసామార్గమును ఆచరించిక్విట్టు ఇండియా లో కీలక పాత్ర వహించెనే. మార్తమ్మను పరిణయమాడి సప్త స్వరముల వంటి సంతానమును పొందెనే. శాసనసభ సభ్యునిగా ప్రజా సేవలో ప్రవేశించిబెజవాడ రైలు జంక్షన్ ఏర్పాటుకు కృషి సల్పిచర్మకారులకు చేయుత నిచ్చిఅన్నదాతకు అండగా నిలచిపాల ప్రాజెక్టులు ప్రారంభించెనే. జనుల గోడును ప్రత్యక్షముగా ఆలకించిగిరిపుత్రులకు గురుకులాలు ఏర్పరచిబడుగు జీవుల బతుకుల్లో వెలుగు దివిటి విద్య ఒక్కటేనని తలచివసతి గృహ నిర్మాణమునకు శ్రీకారం చుట్టెనే.వర్ణాంతర వివాహములను ప్రోత్సహించిఆపదలలో ఆలుమగలుకు అండగా నిలిచిఅధికార దర్పంతో ఆస్తులు కూడగట్టకనిరాడంబరునిగా నిత్యము మసలిస మాజ హితవు సంతానమునకు నేర్పిఅప్పికట్ల వారింటి ఆణిముత్యమై వెలిగిఆదర్శ నాయకునిగా ఎదిగినే జోసెఫ్. (తొలితరం కాంగ్రెస్ నాయకులు, ఆంధ్ర రత్నం మాన్యశ్రీ అప్పికట్ల జోసెఫ్ గారి వర్ధంతి సందర్భంగా వారికి అక్షరాంజలి ఘటిస్తూ...) అనిల్ కుమార్ దారివేములమాచర్ల, పల్నాడు జిల్లా.9951244718

## గడువులోగా ప్రజా సమస్యల అర్జీలను పరిష్కరించాలి జేసీ అశుతోష్ శ్రీవాస్తవ



**గుంటూరు. ఆగస్టు 31 రాజధాని వాయిస్ :**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమర్పించే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన జేసీ, ఒకవేళ పరిష్కారం సాధ్యంకాని అంశాలపై అర్జీదారులకు స్పష్టమైన కారణాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, డ్వామా పీడీ శంకర్, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, డీపీవో సాయికుమార్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శ్రీ పోలేరమ్మకు బోనమెత్తిన వడియరాజులు

### కుంకుమ బండికి జూలకంటి ప్రత్యేక పూజలు



**మాచర్ల.ఆగస్టు 31 రాజధాని వాయిస్ :**పట్టణంలోని 22వ వార్డు నందు వడియరాజు సామాజికవర్గం వారు ప్రతీ ఏటా అనవాయితీగా నిర్వహించే బోనాలు, కుంకుమబండి మహోత్సవం ఆదివారం రాత్రి పొద్దుపాయే వరకు అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా వార్డులోకి విచ్చేసిన ఎమ్మెల్యేను మహిళలు హారతులు పట్టగా, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, కంభంపాటి అనిల్, క్రాంతి కుమార్, లాల్, బత్తుల దుర్గారావు, బత్తుల పిచ్చయ్య, మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, మంజుల సునీత, కొమెర లక్ష్మీ తదితరుల పాల్గొన్నారు.

## సమగ్ర గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం ఎమ్మెల్యే జూలకంటి



**వెల్దుర్తి.ఆగస్టు 31 రాజధాని వాయిస్ :**సమగ్ర గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. సోమవారం మండల పరిధిలోని చిన పర్లపాయ తండా నందు రూ.32 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా అధికారులు సేవలు అందించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పల్లెలన్నీ గ్రామ స్వరాజ్యం వైపు అడుగులు పడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కళ్లం రామాంజిరెడ్డి, కుర్రి శివారెడ్డి, నర్రా గుర్వారెడ్డి, సంజీవరెడ్డి, ముప్పాళ్ళ శ్రీనివాసరావు, కొర్ర రవింద్రనాయక్ , వడితె కొండా నాయక్, కొర్ర బాలు నాయక్, వడితె ధనుంజయ నాయక్, కొర్ర మంగ్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com